దేవరుప్పులలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

గ్రామ సభలతో రేవంత్ డైవర్షన్ డ్రామా

- దావోస్ పర్యటన ఉత్తదే.. విమానం కిరాయిలు దండుగ
- గ్రామసభల్లో నిలదీస్తున్న ప్రజలు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్

దేవరుప్పుల/పెద్దవంగర, జనవరి 24: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల దృష్టి మరల్చేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన గ్రామసభల పేరిట డైవర్షన్ డ్రామాలు ఆడుతున్నారని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. శుక్రవారం జనగామ జిల్లా దేవరుప్పుల, మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం గంట్లకుంటలో వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో ఎర్రబెల్లి మాట్లాడారు. గ్రామసభల్లో ఈ ఊరుకు ఇన్ని ఇండ్లు వస్తున్నయ్.. అన్ని రేషన్‌కార్డులు వస్తున్నయ్.. ఆత్మీయ భరోసా పథకం అమలు చేస్తున్నామంటూ ప్రచారం చేసిన కాంగ్రెస్ సర్కారు వాటి అమలులో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఓ వైపు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాత్రం తాము అధికారికంగా ఇండ్లుకాని, రేషన్ కార్డులు కాని అనౌన్స్ చేయలేదని, గ్రామ సభలో చదివేది అర్హులలిస్టేనని కరాఖండిగా చెబుతున్నపుడు గ్రామసభలెందుకని ప్రశ్నించారు. ప్రతిపక్షాలపై నోరు పారేసుకోవడం ఆపి, ఎన్నికల హామీలైన పింఛన్ల పెంపు, పెండ్లికూతురుకు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెట్టుబడుల కోసం దావోస్ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ విమానం కిరాయలు దండగ చేశారని, రాష్ట్రంలో రియలెస్టేట్ కుప్పకూలిందని, కంపెనీలు తరలుతున్నాయని వ్యాఖ్యానించారు. ఈ ఫార్ములా రేస్, పారిశ్రామిక ఒప్పందాలతో ప్రపంచంలోనే అత్యున్నత పరిశ్రమలను తెలంగాణకు తెచ్చిన ఘనత, హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయిలో తీర్చిదిద్దిన నైపుణ్యం కేటీఆర్ వద్ద ఉంటే, ఆయనను కేసుల పాల్జేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రపంచ పారిశ్రామిక వేత్తలకు నమ్మకం పోయిందని తెలిపారు.

ఇందిరమ్మ రాజ్యం కాదు.. రాక్షస పాలన

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఫైర్

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం కాదు.. రాక్షస పాలన నడుస్తున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత వంటి పథకాల కోసం 1.2 కోట్ల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆ తర్వాత ప్రభుత్వం కులగణన సర్వే చేయించిందని, ఈ వివరాలతో ఆయా పథకాలకు అర్హులను ఎంపిక చేయవచ్చు కాదా? మళ్లీ కొత్తగా దరఖాస్తులు తీసుకోవాల్సిన అవసరం ఏమిటి? ఇంతకుముందు దరఖాస్తులు ఏమయ్యాయి? అని శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కాలయాపన కోసమేనా కొత్త దరఖాస్తుల ప్రక్రియ? అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభల్లో జాబితాలో తమ పేరు రాలేదని పలువురు ఆత్మహత్యయత్నానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అసలు రాష్ట్రంలో ప్రజా పాలన కాదు.. రాక్షస పాలన నడుస్తున్నదని, గ్రామసభలు పూర్తిగా పోలీసుల బందోబస్తు మధ్య సాగుతున్నాయని మండిపడ్డారు.

సర్కారుపై మర్లబడుతున్న తెలంగాణ

- ప్రభుత్వ వైఫల్యాలకు అదే నిదర్శనం
- దరఖాస్తుల పేరుతో మరో దగా
- హక్కుగా రావాల్సిన పథకాలను పోరాడి సాధించుకుందాం
- ఆత్మహత్యలు పరిష్కారం కాదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): గ్రామసభల్లో మర్లబడుతున్న పల్లెలే సర్కార్ వైఫల్యాలకు నిదర్శమని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామసభలో మాజీ సర్పంచ్ నాగరాజు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించడం, ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు లేదని ములుగు జిల్లా బుట్టాయిగూడెంలో కుమ్మరి నాగయ్య అనే దళిత రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించడం మనసును కలచివేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు గ్రామసభల్లో చోటుచేసుకుంటున్న సంఘటనలు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నాయని స్పష్టంచేశారు. తన చావుతోనైనా అర్హులైన పేదలకు పథకాలు ఇవ్వాలని అధికారులకు చెప్తూ పురుగుల మందు తాగి, దవాఖాన పాలైన రైతన్న దుస్థితికి ప్రభుత్వమే కారణమని మండిపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే యావతో, ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా, లబ్ధిదారుల ఎంపిక సరిగ్గా చేయకుండా, జాబితాను విడుదల చేయడంతో ప్రజల్లో గందరగోళం నెలకొంటున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు.. కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలు అంటూ బాహాటంగా ప్రకటించడం గ్రామసభల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పట్ల ప్రజల్లో ఆందళనకు కారణమని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఆత్మీయభరోసా పథకాలు ఈ నెల 26న ప్రారంభిస్తున్నట్టు ప్రచారం చేసుకుంటూ, మరోవైపు గ్రామసభల్లో విడుదలచేసిన జాబితా ఫైనల్ కాదని సాక్షాత్తూ ఉపముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నదని విమర్శించారు. ఫైనల్ జాబితా కాకపోతే నాలుగు రోజుల పరిమితి పెట్టి గ్రామసభలు నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటి? గ్రామసభల్లో విడుదల చేస్తున్న అర్హుల జాబితాకు ఉన్న విలువ ఏమిటి? అని నిలదీశారు.

> ఆత్మహత్యలు పరిష్కారం కాదు. నమ్మి ఓటేసినందుకు నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ పార్టీపై కొట్లాడుదాం. హక్కుగా రావాల్సిన పథకాలను సాధించుకుందాం. బీఆర్‌ఎస్ అండగా ఉంటుంది. ఎవరూ ధైర్యం కోల్పోవద్దు. ఆత్మహత్యలకు పాల్పడకూడదు.
> - హరీశ్‌రావు

దరఖాస్తుల పేరుతో కాంగ్రెస్ దగా

400 రోజులపాటు అన్ని వర్గాల ప్రజలను విజయవంతంగా మోసం చేస్తూ జనవరి 26న మరో మోసానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ పథకాలకు తాము అన్ని విధాలుగా అర్హులమని ప్రజలు ఎన్నిసార్లు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. మీ-సేవ కేంద్రాల్లో, ప్రజాపాలన సెంటర్లలో, కులగణన సందర్భంలో, తాజాగా ఇప్పుడు గ్రామసభల్లో ఇలా ఎంతకాలం దరఖాస్తు చేసుకోవాలో చెప్పాలని డిమాండ్ చేశారు. దమ్మిడీలాభం లేని దరఖాస్తులను ఎన్నని చేయాలని మండిపడ్డారు. గ్రామసభల్లో దరఖాస్తులు కాంగ్రెస్ డ్రామాకు మరో ఎత్తుగడ అని విమర్శించారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా, ఆత్మీయ భరోసా పథకాలు పేదలకు అందించాలనే చిత్తశుద్ధి ఉంటే, గ్రామసభల పేరిట ఇంత డ్రామా అవసరమా? అని ప్రశ్నించారు. ఐటీలో మేటిగా ఉన్న తెలంగాణలో ప్రజలు పనులు వదులుకొని, రోజులపాటు గ్రామసభల్లో నిరీక్షించాల్సిన అవసరం ఏమొచ్చిందని, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలనుకుంటే టెక్నాలజీని ఎందుకు వినియోగించడం లేదని నిలదీశారు. దరఖాస్తుల పేరిట దగా చేయడం తప్ప, ఏడాది పాలనలో కాంగ్రెస్ చేసిందేమీలేదని ఆరోపించారు.

> గ్రామసభల సాక్షిగా తిరగబడుతున్న జనం, ఎక్కడికక్కడ నిలదీస్తున్న తీరు.. రేవంత్‌రెడ్డి పాలనా వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామని చెప్పి, ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పాలిట అభయ హస్తం కాదు, భస్మాసుర హస్తంగా మారింది.
> - హరీశ్‌రావు

పీఆర్టీయూకు రెండు సంఘాల మద్దతు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : పీఆర్టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న పింగిలి శ్రీపాల్‌రెడ్డి, వంగ మహేందర్‌రెడ్డికి సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం(సీపీఎస్ టీఈఏ), ప్రోగ్రెస్సివ్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (పీఎంటీఏ, టీఎస్) సంఘాలు మద్దతు పలికాయి. శుక్రవారం హైదరాబాద్‌లో సమావేశమైన రెండు సంఘాల నేతలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. అనంతరం నారాయణగూడలోని పీఆర్టీయూ టీఎస్ కార్యాలయంలో శ్రీపాల్‌రెడ్డి, వంగ మహేందర్‌రెడ్డికి తమ మద్దతు లేఖను అందజేశారు. సీపీఎస్‌టీఈఏ అధ్యక్షుడు దాముక కమలాకర్, ప్రధాన కార్యదర్శి చీటి భూపతిరావు, వర్కింగ్ ప్రెసిడెంట్లు టీవీ ప్రసాద్, కే నాగేశ్వర్ రావు, పీఎంటీఏ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీశ్, ప్రధాన కార్యదర్శి అనుముల పోచయ్య పాల్గొన్నారు.

కామన్‌సెన్స్ ఉండదా?

- వాటీజ్‌దిస్.. వాట్ ఆర్‌యూ డూయింగ్
- కరీంనగర్ కలెక్టర్ పమేలాపై పొంగులేటి అసహనం
- అధికారిక కార్యక్రమాల్లో తోపులాటపై ఆగ్రహం
- ఏసీపీ కూడా లేదని మంత్రి పొన్నం చిర్రుబుర్రు

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు పర్యటిస్తున్నపుడు ఏసీపీ కూడా అందుబాటులో లేదని మరో మంత్రి పొన్నం ప్రభాకర్ అసహనం వ్యక్తంచేశారు. శుక్రవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ పర్యటన సందర్భంగా ఈ ఘటన జరిగింది. కరీంనగర్‌లోని మల్టీపర్పస్ స్కూల్ వద్ద పార్క్, హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాస్‌లు, నిరంతర నీటి సరఫరాను కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా తోపులాట జరుగగా మంత్రి పొంగులేటి పక్కనుంచి నడుస్తున్న కలెక్టర్ పమేలా సత్పతిని చూసి ఒక్కసారిగా అసహనానికి గరయ్యారు. 'వాట్ ఈజ్ దిస్, వాటర్ యూ డూయింగ్.. కొంచెమైనా కామన్ సెన్స్ ఉండదా.. ఎస్పీ ఎక్కడ' అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ పరిణామంతో కలెక్టర్ నిశ్చేష్టురాలై పోయారు. మరో మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా అసహనం వ్యక్తంచేశారు. మహిళ అని కూడా చూడకుండా కలెక్టర్‌పై అసహనం వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. సభ ముగిసిన తర్వాత మంత్రులకు వీడ్కోలు పలికేందుకు వెళ్లినపుడు కూడా మంత్రులిద్దరూ కలెక్టర్‌ను పట్టించుకోకుండానే అక్కడి నుంచి వెళ్లి పోయారు.

చనిపోయినవారి పేరిట కోట్లల్లో రుణాలు

- మంచిర్యాలలోని ఫైనాన్స్ సంస్థలో భారీ స్కాం

మంచిర్యాల అర్బన్, జనవరి 24 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రముఖ ఫైనాన్స్ కంపెనీలో రుణాల పేరిట భారీ స్కాం జరిగింది. చనిపోయినవారి పేరిట రూ.6 కోట్ల వరకు రుణాలు స్వాహా చేసినట్టు శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. జిల్లా కేంద్రంలోని జన్మభూమినగర్‌లో గల ఓ ఫైనాన్స్ కంపెనీ వ్యక్తిగత, వాహన, ఇండ్లు, మార్టిగేజ్ రుణాలు ఇస్తున్నది. ఇందులో చెన్నూర్, పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన ఇద్దరు మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. వీరు జిల్లాలో చనిపోయిన వారి పేరిట ఆధార్ కార్డులు తయారు చేయించి, రుణాలు ఇప్పించారు. కొంతకాలం వాయిదాలు చెల్లించగా, రానురాను జాప్యం జరిగింది. అనుమానం వచ్చిన హెడ్ ఆఫీస్‌కు చెందినవారు జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ జరుగుతున్నదని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ తెలిపారు.

తన్నుకున్న యువ కాంగ్రెస్ నేతలకు షోకాజులు

హైదరాబాద్, జనవరి24(నమస్తే తెలంగాణ) : పదవుల కోసం గాంధీభవన్‌లో తనుకున్న యూత్ కాంగ్రెస్ నాయకులపై రాష్ట్ర నాయకత్వం సీరియస్ అయింది. శుక్రవారం పలువురు నేతలకు టీపీసీసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలంటూ నోటీసుల్లో పేర్కొంది. కాగా వలస కాంగ్రెస్ నేతలకు మాత్రమే పార్టీలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, వారికి మాత్రమే నామినేటెడ్ పదవులు కట్టబెడుతున్నారంటూ కొత్తగూడెం జిల్లాకు చెందిన యూత్ కాంగ్రెస్ నేతలు గురువారం గాంధీభవన్‌లో తన్నుకున్నారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలస వచ్చిన వారిపై అసలు కాంగ్రెస్ నేతలు దాడికి పాల్పడ్డట్టు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. గొడవకు కారణమైన గడ్డం రాజశేఖర్, బరగాడి సన్ని, సుధీర్ కుమార్, యాదగిరి ప్రదీప్, గుంపుల రవితేజకు టీపీసీసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

మూసీ పునర్జీవానికి 10 వేల కోట్లు ఇవ్వండి

- కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్మెంట్‌కు రూ.10 వేల కోట్లు ఇవ్వాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి వచ్చిన ఖట్టర్‌తో సీఎం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్‌లో రూ.41,70 కోట్లతో సమగ్ర భూగర్భ నీటిపారుదల(యూజీడీ) పథకాన్ని చేపట్టేందుకు నిధులు కేటాయించాని కోరారు. పీఎంఏవై 2.0 కింద తెలంగాణకు 20 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్-II కింద ఆరు కారిడార్లకు రూ.24,269 కోట్ల వ్యయం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కార వేణుగోపాల్, శ్రీనివాసరాజు, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి కరీంనగర్ మేయర్?

10మంది కార్పొరేటర్లతో నేడు చేరిక

కరీంనగర్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ మేయర్ వై సునీల్ రావు బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరుతున్నట్టు తెలుస్తున్నది. తనకు సన్నిహితంగా ఉండే పది మంది కార్పొరేటర్లతో కలిసి శనివారం కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరుతున్నట్టు సమాచారం. ఈ విషయాన్ని మేయర్ సన్నిహిత వర్గాలు ధ్రువీకరిస్తున్నాయి.

స్పౌజ్ బదిలీలు చేపట్టాలి: ఆర్‌యూపీపీ

.హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : స్పౌజ్ బదిలీల్లో భాషా పండితుల ఖాళీలకు అనుగుణంగా బదిలీలు చేపట్టాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ రాష్ట్రం(ఆర్‌యూపీపీ టీఎస్) ప్రభుత్వాన్ని కోరింది. 13 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలు నిలిపివేశారని, కొన్ని జిల్లాల్లో ఖాళీలున్నా బదిలీ చేయలేని పరిస్థితి నెలకొందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీ జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సిములు ఒక ప్రకటనలో కోరారు. అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని భార్యాభర్తలను ఒకే జిల్లాకు కేటాయించాలని వారు విజ్ఞప్తిచేశారు

కేంద్రం నిధులను రాష్ట్రం ఖర్చు చేయట్లే

- యూసీ ఇవ్వకపోవడంతో ఆగుతున్న నిధులు
- ఈ ఏడాది కోటి ఇండ్లు నిర్మిస్తాం
- కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్
- కరీంనగర్‌లో నిరంతర నీటి సరఫరా ప్రారంభం

మానేరు రివర్ ఫ్రంట్‌కు నిధులు విడుదల చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ అభివృద్ధి పనులకు మంజూరు చేస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ఖర్చు చేయడం లేదని కేంద్ర గృహ నిర్మాణ, విద్యుత్తు, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి కోసం రూ.లక్షల కోట్ల నిధులు ఇస్తున్నామని, వీటిని సకాలంలో ఖర్చు చేసి యుటిలైజేషన్ (యూసీ) సర్టిఫికెట్ ఇవ్వక పోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోతున్నాయని తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లో ఆయన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి 24 గంటల నీటి సరఫరాతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జీవన్ విషన్ కింద ఇప్పటికే 74 శాతం గృహాలకు స్వచ్ఛమైన నీరు అందుబాటులోకి వచ్చిందని, దేశ వ్యాప్తంగా 12 కోట్ల ఇండ్లకు నీటి కనెక్షన్లు ఇవ్వగా తెలంగాణలో 38.30 లక్షల ఇండ్లకు ఇచ్చినట్టు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా కోటి ఇండ్లు నిర్మిస్తున్నామని, ఇందులో తెలంగాణకు రావాల్సిన వాటా కంటే ఎక్కువ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

కేసీఆర్ సహకారంతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే గంగుల

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో కరీంనగర్‌ను అభివృద్ధి పథంలో నడిపించానని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. కరీంనగర్‌లో నిరంతర నీటి సరఫరా తన చేతుల మీదుగా ప్రారంభంకావడం తన అదృష్టమని చెప్పారు. మానేరు రివర్‌ఫ్రంట్‌కు అవసరమైన 300 కోట్ల నిధులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇచ్చారు.

గ్రేటర్ సబ్‌స్టేషన్ల టెండర్లలో హైడ్రామా

- చిన్న టెండర్లకు స్వస్తిపలికి గ్లోబల్ టెండర్లకు స్కెచ్
- ఓ మంత్రి కంపెనీకి కట్టబెట్టేందుకు ప్రణాళిక
- ఆ మంత్రి కంపెనీ చెయ్యివ్వడంతో దిక్కుతోచని స్థితిలో అధికారులు
- ఐదు నెలలు ఆలస్యం.. ముంచుకొచ్చిన ఎండాకాలం
- మళ్లీ చిన్న పనులుగా విడగొట్టి టెండర్లకు కసరత్తు
- తారుమారైన టీజీఎస్పీడీసీఎల్ సమ్మర్ యాక్షన్ ప్లాన్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ): సాధారణంగా ఒక ప్రాంతంలోని విద్యుత్ ఫీడర్‌పై అదనపు భారం పడితే అధికారులు వెంటనే అక్కడ కొత్త సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని ప్రతిపాదిస్తారు. సాధ్యమైనంత తొందరగా సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి ఫీడర్‌పై భారాన్ని తగ్గిస్తారు. ఇలా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 72 చోట్ల ఫీడర్లపై అదనపు భారం పడుతున్నట్టు ఏడెనిమిది నెలల కిందటే అధికారులు గుర్తించారు. ఆ మేరకు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాస్తవానికి పాత పద్ధతిలోనైతే ఒకటి, రెండు సబ్‌స్టేషన్లను కలిపి టెండర్లు పిలవడం టీజీఎస్పీడీసీఎల్‌లో ఆనవాయితీ. కానీ, ఇక్కడే అధికారులకు చిక్కొచ్చి పడింది. ఓ అమాత్యుడి కంపెనీ కోసం పాత విధానానికి స్వస్తి పలికి.. కేవలం గ్రేటర్‌లోనే కాదు ఏకంగా దక్షిణ డిస్కం పరిధిలోని 240 సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని ఒకే పనిగా మార్చి గ్లోబల్ టెండర్లు పిలిచారు. తీరా.. మంత్రివర్యుల కంపెనీకి ఇదేదో గిట్టుబాటు కాని పనిగా తెలిసింది. ఇంకేముంది మొహం చాటేసింది. రెండుసార్లు టెండర్లు పిలిచినా బడా కంపెనీలు ఆ వంక కన్నెత్తి చూడలేదు. ఇలా ఆర్నెళ్ల పాటు పుణ్య కాలం కాస్తా గడిచిపోయింది. ఓవైపు వేసవి తరుముకొస్తున్నది. దీంతో ఇప్పటికిప్పుడు మళ్లీ పాత విధానంలో టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. అయినా ఈ వేసవి నాటికి ఒక్క సబ్‌స్టేషన్ కూడా అందుబాటులోకి వచ్చే దాఖలాలు కనిపించకపోవడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. రానున్న వేసవిలో ఫీడర్లపై అదనపు భారం పడుతుండటం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందోనన్న భయం వారిని వెంటాడుతున్నది.

సామగ్రిని వదిలించుకోవాలని..

గతంలో చిన్న చిన్న టెండర్లు పిలిచేవారు. దీంతో పాటు డిస్కం సబ్‌స్టేషన్ నిర్మాణానికి కావాల్సిన సామగ్రి (మెటీరియల్)ని సరఫరా చేసేది. ప్రభుత్వపరంగానే సామగ్రిని ఒకేసారి కొనుగోలు చేయడం వల్ల అంచనా వ్యయం కూడా తగ్గుతుంది. 240 కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి నిరుడు ఆగస్టులో ఏర్పాట్లు చేశారు. ఇక్కడే మంత్రి కంపెనీ రంగప్రవేశం చేసింది. ఆ కంపెనీ ఏపీలో పెద్దఎత్తున సబ్‌స్టేషన్ల నిర్మాణానికి సామగ్రి తెప్పించుకున్నట్లు తెలిసింది. అక్కడ ఏం బెడిసికొట్టిందోగాని ఆ సామగ్రిని ఎలాగైనా వదిలించుకునేందుకు ఆయన కన్ను ఈ కొత్త సబ్‌స్టేషన్ల టెండర్లపై పడింది. మంత్రి కంపెనీ కోసం గ్లోబల్ టెండర్లు పిలిచారు. పైగా మంత్రివర్యుల కంపెనీకి అనుకూలంగా ఉండేందుకు సామగ్రిని కాంట్రాక్టరే సమకూర్చుకోవాలనే నిబంధనను కూడా పొందుపరిచారు.

చల్లగా జారుకున్న మంత్రి కంపెనీ

నిరుడు డిసెంబరులో గ్లోబల్ టెండర్లు పిలిచారు. చాలాచోట్ల స్థలాలతోపాటు ఇతరత్రా సమస్యలున్నట్లు తెలుసుకున్న కంపెనీ.. సామగ్రిని వదిలించుకునేందుకు కాంట్రాక్టు తీసుకుంటే అసలుకే మోసం వస్తుందని గ్రహించింది. గిట్టుబాటుకాదనే తెలియడంతో చల్లగా జారుకున్నదని సమాచారం. ఇతర బడా కంపెనీలు కూడా ఈ సమాచారం తెలుసుకొని గ్లోబల్ టెండర్లకు దూరంగా ఉన్నాయి. దీంతో అధికారులు ఈ నెలలో రెండోసారి టెండరు పిలిచారు. అయినా అదే పరిస్థితి. వేసవి సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఈ కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు అనుకున్నారు. కానీ, మంత్రివర్యుల కంపెనీ రంగప్రవేశం.. వెనక్కి తగ్గడం వంటి పరిణామాలతో పుణ్యకాలం గడిచిపోయింది. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం కూడా క్రమంగా పెరుగుతున్నది. ఈ పరిణామాల దృష్ట్యా మార్చిలోనే వినియోగం భారీస్థాయికి పెరిగే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇటు చూస్తే కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి టెండర్ల దశ కూడా పూర్తికాకపోవడంతో అధికారుల్లో ఆందోళన మొదలైంది.

మళ్లీ పాత విధానంలో టెండర్లు

గ్లోబల్ టెండర్ల ప్రక్రియ బెడిసికొట్టడంతో అధికారులు మళ్లీ పాత విధానం అమలుపై దృష్టిసారించారు. ఇప్పటికే ఆరేడు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి టెండర్లు కూడా పిలిచారు. ఇలా 240 సబ్‌స్టేషన్లు ఎప్పుడు టెండర్ల ప్రక్రియ పూర్తవ్వాలి? పనులు ఎప్పుడు మొదలుకావాలి? సబ్‌స్టేషన్లు ఎప్పుడు అందుబాటులోకి రావాలి? ఇప్పటికిప్పుడు పనులు మొదలుపెట్టినా ఎండాకాలంలోగా సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వచ్చే అవకాశాలు లేనందున అదనపు భారంతో ఫీడర్లు ఎంతమేరకు సహకరిస్తాయో తెలియక అధికారులు ఆందోళన పడుతున్నారు.

భారీగా పెరిగిన విద్యుత్తు డిమాండ్

- జనవరిలోనే ఏప్రిల్, మే స్థాయి వినియోగం
- సరఫరాకు అంతరాయాలు కలిగే అవకాశం
- బయట రాష్ట్రాల నుంచి కొంటేనే పరిష్కారం



హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో విద్యుత్ కోతల ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఏప్రిల్, మేలో ఉండాల్సిన డిమాండ్ ఇప్పుడే నమోదవుతున్నది. ఇప్పటికే ఎండాకాలం రాకముందే విద్యుత్తుకు డిమాండ్ భారీగా పెరుగుతున్నది. గురువారం 14,785 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ నమోదయింది. మూడేండ్ల గణాంకాలు పరిశీలిస్తే జనవరి సగటు 13వేల మెగావాట్లు కాగా ఈ సారి 15వేల గావాట్లకు చేరువైంది.

అక్కడే ఎక్కువ

విద్యుత్తు డిమాండ్ కొన్ని జిల్లాల్లో అధికంగా పెరిగింది. కరీంనగర్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోనే డిమాండ్ ఎక్కువైంది. కాలువల పారకం కంటే బోర్లు, బావుల మీదే ఎక్కువ అధారపడి వ్యవసాయం నడుస్తున్నది. డిమాండ్ పెరుగుదలకు ఇదో కారణమని చెప్తున్నారు. జీహెచ్ఎంసీలో కొత్త కనెక్షన్లు పెరుగుతున్నాయి. కానీ మహానగరంలో సబ్‌స్టేషన్ల నిర్మాణం ముందుకుసాగడం లేదు. నిర్మాణానికి రెండు టెండర్లు పిలిచినా ఒక్క కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. వేసవిలోపు సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తయ్యేలా కూడా కనిపించడం లేదని విద్యుత్తుశాఖ అధికారులు చెబుతున్నారు.

యాసంగి నాట్లు

రైతులు యాసంగి పనులను ముమ్మరం చేశారు. ఇక వేసవిలో విద్యుత్ సరఫరా భారీగా పరిస్థితి ఏంటని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డిమాండ్‌ను అధిగమించేందుకు బహిరంగ మార్కెట్ నుంచి విద్యుత్తు కొంటున్నామని అధికారులు చెప్తున్నారు. రాష్ట్రం వినియోగించే సగం కరెంట్‌ను బయటి నుంచి కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్తు వినియోగం అంచనాలకు మించి పెరగడంతో డిస్కమ్‌లు రోజుకు రూ.8-9 కోట్లు వెచ్చించి విద్యుత్తును కొనుగోలు చేయాల్సి ఉంటుంది. పెరిగిన డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్తు కొనకపోతే వేసవిలో కరెంటు కోతలు తప్పవని జనం ఆందోళన చెందుతున్నారు.

డిస్కంల వారీగా డిమాండ్ (మెగావాట్లు)

డిస్కం	23-1-2025	23-2-2024
ఎన్పీడీసీఎల్	4,886	4,548
ఎస్పీడీసీఎల్	9,499	8,426

ఉమ్మడి జిల్లాల వారీగా డిమాండ్ వివరాలు (మెగావాట్లు)

జిల్లా	24-1-25	నిరుడు
మెదక్	1,756	1,741
నల్లగొండ	1,772	1,729
మహబూబ్‌నగర్	1,892	1,589
వికారాబాద్	322	317
ఆదిలాబాద్	503	430
కరీంనగర్	1,117	1,261
ఖమ్మం	598	508
నిజామాబాద్	881	825
వరంగల్	1,101	1,105
జీహెచ్ఎంసీ	2,644	2,575

నిరుడిలా విద్యుత్తు ఇబ్బందులు రావొద్దు: భట్టి

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): గత వేసవిలో విద్యుత్తును అందించేందుకు ఇబ్బంది పడ్డామని.. ఇప్పుడా పరిస్థితి రాకుండా చూడాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. సమర్థవంతంగా విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి విద్యుత్తు సరఫరాపై ప్రజాభవన్‌లో అధికారులతో సమీక్షించారు. విద్యుత్తు సరఫరాపై రైతులపై ఫిర్యాదులు, సలహాలు స్వీకరించాలని ఆదేశించారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 4 వరకు వేసవి ప్రణాళికపై క్షేత్రస్థాయి సమావేశాలను నిర్వహించాలని స్పష్టంచేశారు. సీఎండీల నుంచి ఎస్ఈ వరకు అంతా క్షేత్రస్థాయిలో ఉండాలన్నారు.